COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ప్రసారార్థం : విజయవాడ,

తేది : 18 ఏప్రిల్, 2023.

**వ్యవసాయ పరపతి సంఘాలలో**
**ప్రయివేటు పెట్టుబడిపై రైతు, ఉద్యోగత సంఘాలతో చర్చించాలి**
**సిపిఐ(యం) డిమాండ్**

కేంద్ర బిజెపి ప్రభుత్వ ఆదేశాలపై వ్యవసాయ పరపతి సంఘాల(పిఎసిఎస్)లో ప్రైవేటు పెట్టుబడిని అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా సహకార ఉద్యోగ సంఘాలు సాగిస్తున్న రాష్ట్రవ్యాప్త ఆందోళనకు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటి మద్దతు ప్రకటిస్తున్నది. ఈ విషయంపై వెంటనే రైతు, ఉద్యోగ సంఘాలతో చర్చించాలని డిమాండ్ చేస్తున్నది.

పిఎసిఎస్‌లను కామన్ సర్వీస్ సెంటర్లుగా మారుస్తూ ఏప్రిల్ 17న రాష్ట్ర ప్రభుత్వం జివో జారీ చేసింది. దీని ప్రకారం సహకార సంఘాలు చేసే అన్ని రకాల వ్యాపారాలు ప్రైవేటుపరం కానున్నాయి. రైతు భరోసా కేంద్రాలు కూడా వీటికి అనుసంధానం అవుతాయి. ధాన్యం తదితర పంటల ఉత్పత్తుల సేకరణలో మిల్లర్ల ఇష్టారాజ్యం అవుతుంది. ఇప్పటికే ధాన్యం అమ్ముడు పోక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రికార్డులలో మద్దతు ధర చూపిస్తూ ఆచరణలో ధరలను దిగ్గోస్తూ రైతులను ముంచుతున్న వైనం అందరికీ తెలుసు. అందువల్ల తక్షణం ఈ జివోని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తున్నాము.

సహకార రంగంలో ప్రైవేటు వ్యాపారస్తులకు ద్వారాలు తెరుస్తూ 2022 నవంబరులో రాష్ట్ర ప్రభుత్వం 1964 సహకార చట్టానికి సవరణ చేసింది. దాని ప్రకారం 50% వాటా ప్రైవేటు వ్యక్తుల చేతిలోకి పోతాయి. ప్రైవేట్ ఫైనాన్సింగ్ బ్యాంకు ప్రతినిధులు కూడా ఇందులో చొరబడతారు. కేంద్రం ఒక పథకం ప్రకారం సహకార రంగాన్ని తన చేతుల్లోకి తీసుకుని భూస్థాపితం చేస్తున్నది. రైతుల ఆస్థిగా ఉన్న సహకార రంగాన్ని ప్రైవేటు కంపెనీల పరం చేసే ప్రక్రియలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ జివో తీసుకొచ్చింది. ఇప్పటికే సహకార రంగం రాష్ట్రంలో సగంపైగా దెబ్బతిన్నది. సహకార డైరీలు, స్పిన్నింగ్ మిల్లులు, చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ఇప్పుడు పరపతి సంఘాలను కూడా బలి తీసుకుంటున్నారు. పక్క రాష్ట్రమైన కర్ణాటకలో అమూల్‌కు వ్యతిరేకంగా సహకార రంగంలోని నందిని డైరీ పటిష్టత కోసం రైతులు సాగిస్తున్న పోరాటం నుండి మన రాష్ట్రం గుణపాఠం నేర్చుకోవాలి.

తక్షణం ఈ జివోను ఉపసంహరించుకుని సహకార రంగాన్ని బలోపేతం చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. దీని కోసం రైతు, ఉద్యోగ సంఘాలు చేసే ఆందోళనకు మద్దతు ప్రకటిస్తున్నది.

(వి.శ్రీనివాసరావు)
రాష్ట్ర కార్యదర్శి